క్లుప్తంగా

12డీ ఫారంపై అవగాహన కల్పించాలి



డిచ్‌పల్లి: ఎన్నికల సంఘం నూతనంగా ప్రవేశ పెట్టిన 12డీ ఫారంపై ఓటర్లకు బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు అవగాహన కల్పించాలని ఆర్డీవో, రూరల్ అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్ రాజేంద్రకుమార్ సూచించారు. మండలంలోని నడిపల్లి రైతు వేదికలో నియోజకవర్గ బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, 40 శాతం వైకల్యం కలిగి ఉన్న వారు 12డీ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకుంటే పోలింగ్ రోజు వారికి ప్రభుత్వం వాహన సదుపాయం కల్పిస్తుందన్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు ఎలా పూర్తిచేయాలనే అంశాలను వివరించారు. పలు అంశాలపై చర్చించారు.సమావేశంలో తహసీల్దార్లు రాజేందర్, అనిరుధ్, కుత్బుద్దీన్, ఎస్‌ఏ కలీం, డిప్యూటీ తహసీల్దార్లు శ్రీకాంత్, అశ్విని, మునీరుద్దీన్, ఆర్‌ఐలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మోపాల్: డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం (బి)లో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే సంక్షేమ జూనియర్ కళాశాలలో గణితం బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా రీజినల్ కో–ఆర్డినేటర్ సత్యనాథ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 7569860140, 8143308130 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దాండియా ఆటలు ఆడ..

- పాటిదార్ భవన్‌లో ఉత్సాహంగా కోలాటాలు
- పాల్గొంటున్న యువత



అమ్మవారి గీతాలు ఆలపిస్తున్న మార్వాడీలు



పాటిదార్ భవన్‌లో దాండియా ఆడుతున్న మార్వాడీ మహిళలు

నిజామాబాద్ సిటీ: జిల్లాలో దసరా అంటే దాండియా నృత్యం గుర్తొస్తుంది. ఉత్తర భారతంలో బాగా ప్రాచుర్యం పొందిన ఈ నృత్యం.. గుజరాతీ, రాజస్థానీలు ఎక్కువగా ఉండే ఇందూరులో సందడి చేస్తోంది. నవరాత్రుల సందర్భంగా జిల్లా కేంద్రంలో దాండియా జోరు బాగా కనిపిస్తోంది. స్థానికులు సైతం ఈ నృత్యం నేర్చుకొని పాదం కలుపుతున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని నగరంలోని ప్రగతినగర్ పాటిదార్ భవన్‌లో మార్వాడీ మహిళలు, స్థానిక యువత తొమ్మిది రోజుల పాటు దాండియా ఆడడం సంప్రదాయంగా వస్తోంది. అమ్మవారికి ఎంతో ఇష్టమైన దాండియాను అమ్మవారి ఎదుట ఆడటం తమకు ఎంతో ఉత్సాహం, శక్తిని ఇస్తుందని వారు పేర్కొంటున్నారు. పెండ్లిలు చేసుకుని వేరే ప్రాంతాలకు వెళ్లిన మహిళలు, ఉద్యోగరీత్యా బయట ప్రాంతాల్లో ఉంటున్నవారు నవరాత్రుల్లో ఇక్కడికి వచ్చి మరీ దాండియా ఆడుతుండడం విశేషం. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు దాండియా పాల్గొంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతున్నారు. ఈ సందర్భంగా దాండియాపై మహిళలు 'సాక్షి'తో తమ అభిప్రాయాలను వెల్లడించారు.

దాండియాతో శక్తి..



నవరాత్రుల్లో అమ్మవారి ఎదుట దాండియా ఆడితే ఎంతో శక్తి వస్తుంది. నేను ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్నాను. ప్రతి సంవత్సరం ఉత్సవాల్లో దాండియా ఆడేందుకు ఇక్కడికి వస్తుంటా. దాండియా ఆడితే శరీరానికి మంచి వ్యాయామం అవుతుంది. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. –డాక్టర్ షేజన్ పటేల్

చిన్ననాటి నుంచి..



పాటిదార్ భవన్‌లో నా చిన్ననాటి నుంచి దాండియా ఆడుతున్నా. నవరాత్రుల్లో నా స్నేహితులతో కలిసి అమ్మవారి ఎదుట దాండియా ఆడటం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. ఈ నృత్యంతో మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేస్తాం. –రష్మి పటేల్, విద్యార్థి

దాండియాను మరిచిపోలేను..



వివాహం అనంతరం విశాఖపట్టణంలో ఉంటున్నా. ప్రతి సంవత్సరం నవరాత్రుల్లో దాండియా ఆడేందుకు ఇక్కడికి వస్తుంటా. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి దాండియా ఆడటం మరిచిపోలేని అనుభూతిగా ఉంటుంది. అమ్మవారి అనుగ్రహం కోసం మాతకు పూజలు చేసి దాండియా ఆడుతాం. –దివ్యా పటేల్, వైజాగ్

ఉత్సాహాన్ని ఇస్తుంది..



దుర్గామాత ఎదుట దాండియా ఆడటం ఉత్సాహాన్ని ఇస్తుంది. దేవీకి ప్రత్యేక పూ జలు నిర్వహించి రాత్రి 12 గంటల వరకు దాండియా ఆడతాం. కుటుంబపెద్దలు, స్నేహితులు చిన్న పిల్లలు గ్రూప్‌లుగా దాండియా ఆ డతాం.ఇది వచ్చే తరాలు కూడ కొనసాగిస్తారు. –నేహ బాధాని

అమ్మవారి అనుగ్రహం కోసం..



నవరాత్రుల్లో దాండియా నృత్యం అమ్మవారి అనుగ్రహం కోసం ఆడటం ఆనవాయితీ గా వస్తోంది. ఇలా చేస్తే అమ్మ వారు మెచ్చి తాము కోరిన కోరికలు నెరవేరుస్తారనే న మ్మకం ఉంది. ఈ నవరాత్రుల్లో అమ్మవారికి ప్రత్యే క పూజలతో పాటు కుంకుమార్చనలు, కల్చరల్ ప్రోగ్రామ్స్ కూడా నిర్వహిస్తాం. –జయబేన్ గోపాల్

కోరికలు నెరవేరుతాయి



నవరాత్రుల్లో తొమ్మిది రోజులపాటు అమ్మవారి ఎదుట భక్తిశ్రద్ధలతో దాండియా నృత్యం ఆడితే అమ్మవారు అనుగ్రహించి కోరిన కోరికలు నెరవేరుతాయి. నాట్యం రూపంలో అమ్మవారిని కొలుస్తాం. ఇలా చేస్తే అమ్మ చల్లని దయ తమపై ఎప్పుడూ ఉంటుందనే నమ్మకం. –పార్వతీదేవి

క్రైం కార్నర్

ఆభరణాల కోసమే హత్య

కేసును ఛేదించిన పోలీసులు

కామారెడ్డి క్రైం: మండలంలోని నర్సన్నపల్లిలో ఓ మహిళ గత నెల 15న హత్యకు గురైన కేసును రూరల్ పోలీసులు ఛేదించారు. విచారణలో మృతురాలి ఒంటిపై ఉన్న ఆభరణాల కోసమే హత్యకు పాల్పడినట్లు తేలింది. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. దేవునిపల్లికి చెందిన శ్రీగాద అరుణ(35), మారాం విజయలు స్నేహితులు. విజయకు అప్పులు బాగా పెరిగిపోవడంతో అరుణపై ఉన్న బంగారాన్ని దొంగిలించాలని భర్త శంకర్, కొడుకు విష్ణువర్ధన్‌తో కలిసి పథకాన్ని రచించింది. గత నెల 4న అరుణను ఇంటికి పిలిచి బాగా మద్యం తాగించారు. స్పృహలో లేనప్పుడు శంకర్, విష్ణువర్ధన్ ఆటోలో ఎక్కించుకొని నర్సన్నపల్లిలో నిర్మించిన ఓ డబుల్ బెడ్ రూం ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడి హత్య చేశారు. తర్వాత ఒంటిపై ఉన్న బంగారు కమ్మలను తీసుకెళ్లారు. వాటిని రూ.16 వేలకు గోల్డ్‌లోన్ తీసుకున్నట్లు నిందితులు వెల్లడించారు. మొబైల్ డాటా ఆధారంగా నిందితులను పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య



కిషన్‌గౌడ్ మృతదేహం

బీబీపేట: మండల కేంద్రానికి చెందిన బట్టుపల్లి కిషన్‌గౌడ్(52) జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కిషన్‌గౌడ్‌కు కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని ఆసుపత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తితో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో పోలీసులు

బీబీపేట: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి బుధవారం తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా దుబ్బాక మండలం తిమ్మాపూర్‌కు చెందిన పాస్తం వెంకటేశ్, రమేశ్ తమ వాహనంలో 25 క్వింటాళ్ల బియ్యాన్ని బీబీపేట మీదుగా తరలిస్తుండగా గ్రామ శివారులో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సివిల్ సప్లై డీటీ కిష్టయ్య ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి



ప్రమాదంలో మృతి చెందిన దంపతులు (ఫైల్)

పిట్లం: సంగారెడ్డి జిల్లా అల్లాదుర్గ్ గేట్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పిట్లం మండలంలోని బొల్లక్‌పల్లికి చెందిన దంపతులు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. బొల్లక్‌పల్లికి చెందిన నారాయణ(65) భార్య దేవమణి (58)తో కలిసి కారులో హైదరాబాద్‌లో ఉన్న కుమారుడిని కలిసి దుస్తులు కొనుగోలు చేసి స్వగ్రామానికి వస్తుండగా అల్లాదుర్గం గేట్ సమీపంలో కారు బోల్తాపడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వీరిని స్థానికులు అంబులెన్స్‌లో జోగిపేట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబీకులు బుధవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

పుప్పాలపల్లి హత్యకేసులో ఇద్దరి అరెస్టు



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి: జక్రాన్‌పల్లి మండలం పుప్పాలపల్లి శివారులో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిచ్‌పల్లి సీఐ కృష్ణ, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి మండలంలోని గన్యాతండా వద్ద అదే గ్రామానికి చెందిన కుందాపురం గొల్ల నర్సయ్య, నీలపు అలియాస్ నాయకపు రమేశ్‌ను పట్టుకొని విచారించగా గ్రామ చెరువు వద్ద మద్యం తాగినట్లు తెలిపారు. అనంతరం మహేశ్‌కి, గొల్ల నర్సయ్య మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో మహేశ్‌ను ఇద్దరు కలిసి కర్రతో తీవ్రంగా కొట్టి చంపేశారు. అనంతరం మృతదేహాన్ని, బైకును, సెల్‌ఫోన్‌ను చెరువులో పడేశారు. నిందితులను గన్యాతండాలో పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

పోస్టాఫీస్‌లో చోరీకి యత్నం

ఎల్లారెడ్డి: పట్టణంలోని పోస్టాఫీస్‌లో మంగళవారం రాత్రి ఓ దొంగ చోరీ యత్నానికి పాల్పడినట్లు స్థానికులు బుధవారం తెలిపారు. మండలంలోని భిక్కనూర్ గ్రామానికి చెందిన మహేశ్ అనే నిందితుడు అర్ధరాత్రి పోస్టాఫీస్ తాళం పగల గొట్టేందుకు యత్నిస్తుండగా రోడ్డు గుండా వెళ్తున్న యువకులు గమనించి పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

ప్రమాదంలో తహసీల్దార్‌కు గాయాలు

మోర్తాడ్: మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏర్గట్ల తహసీల్దార్ మహ్మద్ యూసుఫ్‌కు బుధవారం గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్నికల సమావేశ నిమిత్తం తహసీల్దార్ భీమ్‌గల్‌కు సహచర ఉద్యోగితో కలిసి బైక్‌పై వెళ్తుండగా మోర్తాడ్ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ వీరిని ఢీకొన్నది. ఈ ఘనటలో తహసీల్దార్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

భర్త వివాహేతర సంబంధం..

- హోటల్‌లో పట్టుకున్న భార్య
- కేసు నమోదు చేసిన పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ ఇంటర్నేషనల్ హోటల్‌లో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న భర్తను ఓ భార్య రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని పోలీసులకు అప్పగించింది. నాలుగో టౌన్ ఎస్సై సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంనగర్‌కు చెందిన రవి నగరంలోని పలు హోటళ్లకు కూరగాయలను సరఫరా చేస్తాడు. ఈ క్రమంలో నగరానికి చెందిన స్వప్నతో పరిచయం ఏర్పడింది. వీరు ఈ నెల 16 నుంచి హోటల్‌లోనే ఉంటున్నారు. రవి మూడు రోజుల నుంచి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గమనించి హోటల్‌లో ఉన్నట్లు తెలుసుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సోషల్ మీడియాలో రెచ్చిపోవద్దు..

- సామాజిక మాధ్యమాలపై ఎలక్షన్ కమిషన్ నిఘా

ఎల్లారెడ్డి: చేతిలో సెల్‌ఫోన్ ఉంది కదా అని సోషల్ మీడియాలో ఎమోషనల్ అయ్యి రాజకీయాలపై ఏదైనా కామెంట్ చేశారా..లేదా ఎవరైన పెట్టిన పోస్టింగ్‌లపై కటువుగా ఖండించారా ఇకపై ఊచలు లెక్క పెట్టాల్సిందే. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న ప్రస్తుత తరుణంలో సామాజిక మాధ్యమాలైన వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్, ట్విట్టర్లలో వచ్చే పోస్టింగ్‌లు, కామెంట్లపై ఎలక్షన్ కమిషన్ పూర్తి నిఘా పెట్టింది. ఎన్నికలయ్యేంత వరకు రాజకీయ నాయకులు, పార్టీలపై వ్యక్తిగత విమర్శలు, దూషణలు, పుకార్లు సృష్టించి వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఎన్నికల కమిషన్ అధికార యంత్రాగాలకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే, శాంతి భద్రతలకు విఘాతం కల్పించే కామెంట్లు చేసే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు. అంతేకాకుండా ఈ మధ్య పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న యూట్యూబ్ మీడియా చానళ్లపై ఈసీ కొరడా ఝుళిపించనుంది.

మీడియా ముసుగులో చేతిలో ఒక లోగో మైకులు పట్టుకుని, సెల్‌ఫోన్ల ద్వారా వీడియోలు తీస్తూ ఎడాపెడా విచక్షణ లేకుండా యూట్యూబ్ చానళ్లలో పెడుతున్న వార్తలపై ఎన్నికల అధికారులు కఠినంగా వ్యవహరించనున్నారు. సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులపై నిఘా పెట్టేందుకు ఎన్నికల అధికారులు ప్రతీ జిల్లాలో ప్రత్యేక మీడియా మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కమిటీలో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, పోలీసు అధికారుల పర్యవేక్షణలో, సోషల్ మీడియా నిపుణుడు, సీనియర్ జర్నలిస్ట్, సీనియర్ సిటిజన్, డీపీఆర్వో సభ్యులుగా ఉండనున్నారని అధికారులు వివరించారు. వీరు ప్రతీరోజూ దినపత్రికల్లో వచ్చే వార్తలను, రాజకీయ నాయకుల వ్యాఖ్యలను పరిశీలిస్తారు. ఈ కమిటీ చేసిన సూచనల మేరకు వివాదాస్పద పోస్టులు, వార్తలు పెట్టిన వారికి ఐటీ సెల్, సైబర్ క్రైం అధికారులు నోటీసులు జారీ చేసి విచారణ నిర్వహించి క్రిమినల్ చర్యలు తీసుకోనున్నారు.

గ్రూప్ అడ్మిన్‌లపైనా కేసులు..

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న ప్రస్తుత తరుణంలో వాట్సప్ గ్రూపుల్లో సభ్యులెవరైనా రెచ్చగొట్టే కామెంట్లు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే నాయకుల ప్రసంగాలు వైరల్ చేసినా వారితో పాటు ఆ గ్రూప్ అడ్మిన్‌లపైన కూడా క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టు చేయనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. గ్రూపుల్లో పెడుతున్న వ్యాఖ్యలు, కామెంట్లు సామరస్యపూర్వకంగా ఉండేలా ఆయా గ్రూపుల అడ్మిన్‌లే బాధ్యత తీసుకోవాలన్నారు.

ఎన్నికల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి



డిగ్రీ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

బాన్సువాడ రూరల్: అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని నిజామాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. బాన్సువాడలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల, నూతనంగా నిర్మించిన ఆర్డీవో కార్యాలయాలను అదనపు కలెక్టర్ యాదిరెడ్డితో కలిసి బుధవారం సందర్శించారు. నియోజక వర్గంలోని 9మండలాల్లో బీర్కూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ మినహా 6మండలాలు పాత నిజామాబాద్ జిల్లాలోనే ఉన్నందున జిల్లా ఎన్నికల అధికారి హోదాలో కళాశాలలో ఏర్పాటు చేసే ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూంను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవోలు భుజంగరావు, రాజాగౌడ్, తహసీల్దార్ వరప్రసాద్, సర్వేయర్ అనిల్, గిర్దావర్ అశోక్, సిబ్బంది ఉన్నారు.

ప్రాథమిక దశలోనే లెప్రసీని గుర్తించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు

మాక్లూర్: ప్రాథమిక దశలోనే కుష్టు వ్యాధిని గుర్తించి వ్యాధిగ్రస్తులకు తగు మందులు అందిస్తే ఫలితం ఉంటుందని రాష్ట్ర లెప్రసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లోని వ్యాధిగ్రహస్తులపై దృష్టి సారించాలన్నారు. అనంతరం వ్యాధి గ్రహస్తుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీపీఎం శ్రీచందన్, వైద్యులు వరలక్ష్మి, ఆనంద్‌కుమార్, సుధాకర్, దేవపాలం, ఆశవర్కర్లు, సిబ్బంది ఉన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత



జిల్లా కేంద్రంలో పోలీసులు పట్టుకున్న నగదు

ఖలీల్‌వాడి/ నాగిరెడ్డిపేట/ మద్నూర్/ ఎల్లారెడ్డి: నగరంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ. 8 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. మాక్లూర్ తండాకు చెందిన బాణావత్ మోతీలాల్ వద్ద ఈ నగదు లభించగా సరైన ఆధారాలు చూయించకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లో ఒకరి నుంచి రూ.లక్షా50వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ వద్ద కారులో వెళ్తున్న ఒకరి నుంచి రూ. రెండు లక్షల నగదును పట్టుకున్నట్లు తహసీల్దార్ మహమ్మద్ ముజీబ్, ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. సరైన ఆధారాలు చూయించక పోవడంతో సీజ్ చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ మహేశ్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒకరి నుంచి రూ. 15 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

మద్యం పట్టివేత



బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి బుధవారం తెలిపారు. సుమారు రూ. 4338 మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వాహనాలను తనిఖీ చేయాలి

రుద్రూర్/ కమ్మర్‌పల్లి: కోటగిరి పీఎస్ పరిధిలోని పోతంగల్ శివారులో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోతంగల్‌లోని హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట కోటగిరి ఎస్సై సందీప్, సిబ్బంది ఉన్నారు. కమ్మర్‌పల్లిలోని పోలీస్ చెక్‌పోస్టును ఆర్మూర్ ఏసీపీ జగదీశ్‌చందర్ సందర్శించారు. పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీని పరిశీలించారు. ఎస్సై, సిబ్బంది ఉన్నారు.

కొడుకును హత్య చేసిన కేసులో తండ్రి రిమాండ్

నవీపేట: మోకన్‌పల్లి గ్రామంలో కొడుకును చంపిన కేసులో తండ్రిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ బుధవారం తెలిపారు. పొలం అమ్మిన డబ్బుల విషయంలో తండ్రి కిషన్, కొడుకు శ్రీకాంత్ మధ్య ఈ నెల 14న గొడవ జరగగా కోపంతో తండ్రి కొడుకును హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో విచారణ చేపట్టి నిందితుడు కిషన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు యువకుడి మృతి

నవీపేట: నందిగామ గ్రామానికి చెందిన కప్ప నాగేశ్(38) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. కాలకృత్యాలకు వెళ్లిన నాగేశ్‌కు ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



సిరికొండ: మండల కేంద్రంతో పాటు న్యావనంది, పాకాల గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఏసీపీ కిరణ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఆ కేంద్రాల వద్ద ఎన్నికల సమయంలో ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ధర్పల్లి సీఐ సైదాకు సూచించారు. ఆయన వెంట ఎస్సై, సిబ్బంది ఉన్నారు.


దుబ్బాకలో..



ధర్పల్లి: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్ బుధవారం పరిశీలించారు. దుబ్బాక, రేకులపల్లి, డీబీ తండా, హోన్నాజీపేట్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, బూత్ స్థాయి అధికారులతో మాట్లాడారు. ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏసీపీ వెంట సీఐ సైదా, ఎస్సై వంశీకృష్ణారెడ్డి ఉన్నారు.

జిల్లా కేంద్రంలో సైబర్ మోసం

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పీఎస్ పరిధిలో ఓ మహిళను సైబర్‌నేరగాళ్లు మోసం చేసినట్లు ఎస్సై సంజీవ్ బుధవారం తెలిపారు. సదరు మహిళ తన ఫోన్‌లో ఇన్‌స్టాగాంలో వచ్చిన పార్ట్‌టైం జాబ్ లింక్‌పై క్లిక్ చేయగా వారు ఓ లింక్‌ను పంపించారు. టాస్క్‌లు పూర్తి చేస్తే డబ్బులు అధికంగా వస్తాయంటు మొదటగా ఆమె అకౌంట్‌కు రూ. వెయ్యి పంపించారు. ఇది నమ్మిన మహిళ వారు చెప్పిన విధంగా విడుతల వారీగా వారి అకౌంట్లకు రూ. లక్షా25వేల నగదును పంపింది. దీంతో మోసాన్ని గ్రహించిన సదరు మహిళ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



ఇందూరుకు 15వ సారి..

1952లో అర్బన్ నియోజకవర్గం ఏర్పడింది. ఇప్పటిదాకా 14సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరుగగా, 15వసారి ఎన్నికల సందడి నెలకొంది.

- 10లో ▸



ఇజ్రాయిల్ నుంచి తెలంగాణకు..

భారత ప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ అజయ్‌లో భాగంగా ఇజ్రాయిల్ నుంచి తెలంగాణకు కార్మికులు వస్తున్నారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.5 /22.5

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండతీవ్రత ఎక్కువగా ఉండవచ్చు. సాయంత్రం చల్లటి గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

'కాకతీయ' ద్వారా తగ్గిన నీటి విడుదల



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా మంగళవారం నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు తగ్గించారు. కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 558 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 3,500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090.8(89.21 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

ఊరికెళ్తే..తస్మాత్ జాగ్రత్త

- సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి : దసరా సెలవులకు వెళ్లే వారు ఇంటికి తాళాలు వేసే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ పేర్కొన్నారు. సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం వేళ రద్దీ పేపర్లు, ఖాళీ సంచులు, పూల మొక్కలు, హర్ ఏక్ మాల్ వస్తువులను విక్రయించే వారిపై నిఘా పెట్టాలన్నారు. రాత్రయితే అనుమానంగా సంచరించే వారిని పలుకరించవద్దన్నారు. శివారు ప్రాంత కాలనీలలో తాళం వేసిన ఇళ్లను అపరిచిత వ్యక్తులు ఉదయం వేళ వెతకటం, రాత్రి వేళ చోరీలకు పాల్పడతారన్నారు. ఇరుగు పొరుగు వారిని ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పాలన్నారు. ప్రయాణాలు తప్పనిసరైతేనే వేసుకోవాలని లేకపోతే త్వరగా వచ్చే ప్రయత్నం చేయాలన్నారు. పక్కింటి వారి ద్వారా ఇంటికి సమాచారం తెలుసుకోవాలన్నారు. ఖరీదైన వస్తువులు ఇళ్లలో ఉంచి ఊళ్లకు వెళ్లవద్దన్నారు. కాలనీవాసులు గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాళం వేసి ఊరు వెళ్లే ముందు మీ సమీప పీఎస్‌లో తెలియజేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

లక్కీ డ్రా పొడిగింపు

ఖలీల్‌వాడి : దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రయాణికులకు కోసం లక్కీ డ్రాను పొడిగిస్తున్నట్లు ఆర్ఎం జానీరెడ్డి తెలిపారు. ఈనెల 21 వరకు 30 వరకు మధ్య ప్రయాణించే వారికే లక్కీ డ్రా పాల్గొనే అవకాశముండగా, ఈ గడువును 18వ తేదీ నుంచి 30వ తేదీ నుంచి ముందుకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రశాంత్‌రెడ్డిని పరామర్శించిన కేటీఆర్



వేల్పూర్ : మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవల మరణించగా, ఆయనను మంగళవారం మంత్రి కేటీఆర్ మంగళవారం వేల్పూర్‌లో పరామర్శించారు. మంజులమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ప్రశాంత్‌రెడ్డికి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రావుల శ్రావణ్‌కుమార్‌రెడ్డి,తక్కళ్లపల్లి రవీందర్‌రావు, రాజేశ్వర్‌రావు పరామర్శించారు. ఆయన వెంట ఆర్మూర్ ఎమ్మెల్యే, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, ఐహెచ్ఎఫ్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, నాయకులు కోటపాటి నర్సింహా నాయుడు, ఇతర నాయకులు ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ఒంగోలు: సీబీఎస్ఈ సౌత్‌జోన్ రైఫిల్ షూటింగ్ పోటీలు మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలు నగరంలోగల నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూలులో ముగిశాయి. ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవుల్లోని సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన దాదాపు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 12 వ్యక్తిగత విభాగాలు, 12 టీం ఈవెంట్లుగా రైఫిల్, పిస్టల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో రాణించిన వారు త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు సౌత్‌జోన్ తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. అండర్ 14 బాలుర విభాగంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన అబ్దుల్ రహమాన్ ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

కాంగ్రెస్‌లో కలకలం

కాంగ్రెస్ పార్టీ మొదటి విడత టికెట్ల ప్రకటన నేపథ్యంలో అసంతృప్తి స్వరాలు ఊపందుకుంటున్నాయి. మరోవైపు నిజామాబాద్ అర్బన్, రూరల్ స్థానాల టికెట్ల విషయంలో ప్రచారంలోకి వచ్చిన అంశాలు ఆ పార్టీ శ్రేణుల్లో మరింత అసహనాన్ని రగిలిస్తున్నాయి.



- రాహుల్ పర్యటనకు ముందు రగులుతున్న అసంతృప్తి
- ఆయారాంలకేనా అవకాశమంటున్న సీనియర్లు
- బాల్కొండ టికెట్ దక్కక డీసీసీ అధ్యక్షుడిలో అసహనం
- 'రూరల్'లో తెరపైకి మండవ పేరు.. ఆగ్రహం వ్యక్తం చేస్తున్న శ్రేణులు
- 'అర్బన్'లోనూ అదే పరిస్థితి..
- అభ్యర్థిత్వం కోసం ప్రయత్నిస్తున్న ధర్మపురి సంజయ్
- తనకే అవకాశం ఇస్తారంటూ ఆకుల లలిత ప్రచారం
- ఏఐసీసీ నేతల తీరుపై బొమ్మ అనుచరుల మండిపాటు
- గందరగోళ పరిస్థితుల్లో నగరంలో అగ్రనేత పర్యటనపై నీలినీడలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జిల్లా పర్యటన నేపథ్యంలో చెలరేగుతున్న ఈ అసంతృప్తి ఎక్కడికి దారితీస్తుందోనని పార్టీ నాయకత్వం కలవరపడే పరిస్థితి నెలకొంది. నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేసేందుకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మహేష్‌గౌడ్‌కు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి, భట్టివిక్రమార్క సైతం మద్దతుగా ఉన్నారు. అయితే అర్బన్ నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీ ఓట్లు అత్యధికంగా ఉన్నాయంటూ, ఈ టికెట్‌ను ముస్లిం మైనారిటీకి కేటాయించాలని ఢిల్లీలోని ఏఐసీసీకి చెందిన ముస్లిం నేతలు పట్టుబడుతుండడం విశేషం. నిజామాబాద్ అర్బన్, మహబూబ్‌నగర్ టికెట్లను ముస్లిం నేతలకు కేటాయించాలని సదరు ఢిల్లీ నేతలు పట్టుబడుతుండడం గమనార్హం. మహేష్‌గౌడ్ రాష్ట్ర పార్టీ ఆర్గనైజింగ్ వ్యవహారాలను అంకితభావంతో, నిబద్ధతతో నిర్వహిస్తూ వివాదరహితుడిగా ఉన్నప్పటికీ టికెట్ రాకుండా అడ్డుపడడమేమిటని ఆయన అనుచరులు మండిపడుతున్నారు. మరోవైపు బలమైన మున్నూరుకాపు వర్గానికి చెందిన, ముస్లిం మైనార్టీల్లో గట్టి పట్టున్న మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ సైతం అర్బన్ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ విప్ ఈరవత్రి అనిల్ కూడా ఈ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన ఆకుల లలిత కూడా అర్బన్ కాంగ్రెస్ టికెట్ తనకేనని ప్రచారం చేసుకోవడంపై పార్టీ శ్రేణులు పరేషాన్ అవుతున్నారు. ఈ పరిణామాలు, గందరగోళం నేపథ్యంలో నిజామాబాద్ నగరంలో రాహుల్ పాదయాత్ర రద్దు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బోధన్ పర్యటన రద్దు కాగా, కేవలం ఆర్మూర్ బహిరంగ సభలో మాత్రమే రాహుల్ హాజరు కానున్నట్లు సమాచారం.

బోధన్ నియోజకవర్గంలో..

బోధన్ నియోజకవర్గంలో ముస్లింలు, ఇతర అన్నివర్గాల మద్దతు కలిగి ఉన్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి గెలుపు ఖాయమని పార్టీ శ్రేణులు ధీమాగా ఉన్నాయి. అయితే ఇదిలా ఉండగా బాల్కొండ, ఆర్మూర్ టికెట్ల కేటాయింపు విషయంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఈరవత్రి అనిల్‌కుమార్ తీవ్ర అసహనంగా ఉన్నారు. ఇన్నేళ్లు అనేక కష్టాలకోర్చి పార్టీ కోసం పాటుపడితే పార్టీ నాయకత్వం ఇలా చేయడమేమిటని మానాల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా పార్టీలోకి తీసుకున్నవాళ్లకు ఆ వెంటనే టికెట్ కేటాయించడమేమిటని అంటున్నారు. బాల్కొండ టికెట్ కోసం మానాల మోహన్‌రెడ్డి చివరివరకు గట్టి ప్రయత్నాలు చేశారు. చివరిలో ఇలా జరగడంతో ఆగ్రహంతో రగిలిపోతున్నారు. పార్టీలోకి వచ్చిన వెంటనే సునీల్‌రెడ్డికి టికెట్ కేటాయించడమేమిటని మండిపడుతున్నారు. ఆర్మూర్ టికెట్‌ను బీజేపీ నుంచి వచ్చిన వినయ్‌కు ఆగమేఘాల మీద కేటాయించడమేమిటని ఏబీ శ్రీనివాస్, మార చంద్రమోహన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అర్బన్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న తనను పరిగణలోకి తీసుకోకపోవడమేమిటని ఈరవత్రి అనిల్ బాధను వ్యక్తం చేస్తున్నారు.

రూరల్ నుంచి..

నిజామాబాద్ రూరల్ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నగేశ్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు పార్టీలో చేరనున్నట్లు, ఆయనకే టికెట్ కేటాయించనున్నట్లు ప్రచారం జరుగుతుండడంతో నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాహుల్ జిల్లా పర్యటన నేపథ్యంలో సోమవారం ఏఐసీసీ కార్యదర్శులు విష్ణునాథ్, రోహిత్‌చౌదరిలు నిజామాబాద్‌కు వచ్చారు. డిచ్‌పల్లి వద్ద వీరిద్దరిని, వీళ్లతో పాటు ఉన్న మహేష్‌కుమార్‌గౌడ్‌ను నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వచ్చి అడ్డుకున్నారు. రూరల్ టికెట్‌ను భూపతిరెడ్డికి కేటాయించాలని, లేనిపక్షంలో సహకరించేది లేదని తెగేసి చెప్పడం గమనార్హం. ఇప్పటికే తొలి జాబితాలో జిల్లా నుంచి మూడింట్లో రెండు టికెట్లు పార్టీలోకి కొత్తగా వచ్చినవారికే కేటాయించారని, మిగిలిన టికెట్లు కూడా ఇలాగే ఇస్తే ఊరుకునేది లేదని చెప్పడం విశేషం. దీంతో టికెట్ భూపతిరెడ్డికే ఖరారు అవుతుందని వారు చెప్పడంతో నాయకులు, కార్యకర్తలు శాంతించారు.

మొబైల్ ఫోన్ నుంచే నామినేషన్

- ప్రత్యేక యాప్‌ను రూపొందించిన ఎలక్షన్ కమిషన్
- నామినేషన్ చివరి తేదీ నాటికి పత్రాలు సమర్పించాలి



సువిధ పోర్టల్ యాప్

ఖలీల్‌వాడి : శాసనసభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఇంటి నుంచి తమ వద్ద ఉన్న స్మార్ట్ ఫోన్ ద్వారా నామినేషన్ వేసేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. 2018 జరిగిన ఎన్నికల్లో అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి తమ అనుచరవర్గంతో వెళ్లేవారు. అభ్యర్థులు నామినేషన్‌కు భారీ స్థాయిలో వెళ్లడంతో అభ్యర్థులకు ఖర్చు తడిసి మోపెడయ్యేది. నియోజకవర్గం నుంచి వచ్చే కార్యకర్తలు, నాయకులకు ప్రత్యేకంగా వాహనాలను సమకూర్చాల్సి వచ్చేది. అభ్యర్థులు ఖర్చులను తగ్గించేందుకు ఎన్నికల సంఘం యాప్‌ను ఉపయోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. సాంకేతిక రంగం అభివృద్ధి చెందడంతో ఎన్నికల సంఘం ఈసారి ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఆన్‌లైన్‌లో అభ్యర్థులు నామినేషన్ వేయడానికి 'సువిధ డాట్‌ఇన్' యాప్‌ను ప్రవేశపెట్టింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన యాప్‌ను ఉపయోగించుకునే అవకాశాలున్నాయి.

స్లాట్ బుకింగ్..

అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత నుంచి ఈ యాప్ ద్వారా నామినేషన్ వేసుకునే అవకాశం ఉంటుంది. నామినేషన్లు పూర్తయ్యే నాటికి ఎన్నికల కమిషనర్ సూచించిన నామినేషన్ పత్రాలను పొందుపర్చాల్సి ఉంటుంది. ఈ యాప్‌లో దరఖాస్తుదారుల వివరాలను దశల వారీగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. నామినేషన్ వేసిన అభ్యర్థికి సంబంధించిన ఆస్తులు, అఫిడవిట్ పత్రాలు, నామినేషన్ డిపాజిట్, పదిమంది బలపర్చిన వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో అన్ని వివరాలు నమోదు చేసిన తర్వాత నామినేషన్ దాఖలు చేసేందుకు నిర్ణీత సమయంలో స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం కల్పిస్తుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పూర్తయిన తర్వాత మూడు సెట్లు రిటర్నింగ్ అధికారికి అందించాల్సి ఉంటుంది. తర్వాత నామినేషన్ పరిశీలన, అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు. ఈ కేటాయింపులపై అభ్యర్థిగాని వారి తరుపున ఎవరైనా వెళ్లే అవకాశాన్ని కల్పించారు.

స్వతంత్ర అభ్యర్థులకు ఉపయోగం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 9 నియోజకవర్గంలోని స్వతంత్ర అభ్యర్థులు పోటీచేసే అవకాశం ఉండటంతో ఆన్‌లైన్‌లో సువిధ యాప్ ఎక్కువగా ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. గతంలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న సమయంలో పత్రాలు పూర్తి స్థాయిలో తీసుకురాకుంటే చివర్లో ఇబ్బందులు తలెత్తేవి. ఈ సారి ఈ యాప్ ద్వారా అన్ని రకాల పత్రాల గురించి తెలుసుకొని వాటిని నేరుగా యాప్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత గడువులోగా పత్రాలను అధికారులకు ఇవ్వవచ్చు.

ఆకుల లలితను నమ్మొద్దు



నగరంలోని అర్బన్ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి

- దళిత బంధులాగా మైనార్టీ బంధు ఇవ్వాలి
- అర్బన్‌లో బీజేపీ తరఫున బలమైన అభ్యర్థి
- ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: డీఎస్‌ను నమ్మించి మోసం చేసిన మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత మళ్లీ ఆయన కుమారుడిని ఇబ్బంది పెట్టేందుకు సిద్ధమయ్యారని, ఆమెను నగరంలోని మున్నూరు కాపులు, మైనార్టీలు, మరెవరూ నమ్మవద్దని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని బస్వా గార్డెన్‌లో బీజేపీ అర్బన్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జి, బెల్గాల్ ఎమ్మెల్యే అభయ్ పాటిల్, జిల్లా ఎన్నికల ఇన్‌ఛార్జి, పూణే ఎమ్మెల్యే సిద్ధార్థ్ సిరోలి బూత్ లెవల్, మండల అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌ఛార్జిల వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ బీఆర్ఎస్ 2014, 2018 మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. 2023 మేనిఫెస్టో పనికి రాదన్నారు. మైనార్టీలు బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలుస్తున్నారని, దళితబంధు వలే మైనార్టీలకు రూ.10లక్షలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. దళితబంధు అన్ని కుటుంబాలకు అందాలన్నారు. ముస్లిములకు ఇంత అన్యాయం జరుగుతున్నా ఓవైసీ ఎందుకు అడగట్లేదన్నారు. రేవంత్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ కవిత ఆకుల లలితకు కాంగ్రెస్ టికెట్ ఇప్పించి, ఓట్లు చీల్చి బీఆర్ఎస్‌కు మేలు చేసేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. కేసీఆర్ కావాలో.. నరేంద్ర మోదీ కావాలో అని మైనార్టీలు, మున్నూరుకాపులు ఇకనైనా ఆలోచించుకోవాలని హితవుపలికారు. మత రాజకీయాలు చేస్తున్నారని కేటుగాడు పేర్కొనడంపై కేటీఆర్‌ను ఉద్దేశించి ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీకి అన్ని మతాలు, కులాలు ఒక్కటేనని ఎంపీ పేర్కొన్నారు. అర్బన్‌లో పేదలు, హిందువులు, ముస్లింల కోసం పని చేసే పాపులర్ అభ్యర్థి బీజేపీ తరపున బరిలో ఉంటారని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. జాతీయ గీతంతో సమావేశాన్ని ముగించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు వెంకట రమణి, బాల్‌రెడ్డి, పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ, కార్పొరేటర్లు స్రవంతిరెడ్డి, న్యాలం రాజు, స్వామి యాదవ్, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పంచరెడ్డి లింగం తదితరులున్నారు.

భారీగా బంగారం, నగదు స్వాధీనం



కమ్మర్‌పల్లిలో స్వాధీనపర్చుకున్న బంగారు నగలు



నగరంలో సీజ్ చేసిన నగదుతో పోలీసులు

- వాహనాల తనిఖీలో పట్టివేత

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీలో భారీగా బంగారం, వెండి ఆభరణాలను పట్టుకున్నారు. ఎన్నికల నియమావళి అమలులో భాగంగా నిజామాబాద్, జగిత్యాల జిల్లాల సరిహద్దు గ్రామమైన కమ్మర్‌పల్లి గ్రామ శివారులోని బ్రహ్మంగారి గుట్ట వద్ద జాతీయ రహదారిపై ఎస్సై రాజశేఖర్ వాహనాలు తనిఖీ చేస్తుండగా మెట్‌పల్లి నుంచి కమ్మర్‌పల్లి వైపు వస్తున్న కారును తనిఖీ చేశారు. కారులో భారీగా బంగారం, వెండి ఆభరణాలు కనిపించగా, వాటిని స్వాధీనం చేసుకొని పీఎస్‌కు తరలించారు. 45.900 తులాల బంగారం (450 గ్రాములు), 17 కిలోల వెండిగా అధికారులు లెక్కతేల్చారు. వ్యాపారి ఆభరణాలకు సంబంధించి ఎటువంటి ఆధార పత్రాలు చూపించకపోవడంతో సీజ్ చేసినట్లు ఆర్మూర్ ఏసీపీ జగదీష్ చందర్ తెలిపారు. పట్టుకున్న ఆభరణాల విలువ సుమారు రూ. 40.50 లక్షలు ఉంటుందన్నారు. సీజ్ చేసిన ఆభరణాలను జిల్లా ట్రెజరీకి అప్పగించినట్లు పేర్కొన్నారు. మండలంలోని బషీరాబాద్‌కు చెందిన వ్యాపారి మెట్‌పల్లిలో జ్యూవెలరీ షాప్ నడుపుతున్నాడు. దసరా పండగా నేపథ్యంలో షాపులోని ఆభరణాలను గ్రామంలోని కుటుంబీకులు, బంధువులకు చూపించడానికి తీసుకెళ్తుండగా, వాహనాల తనిఖీలో పోలీసులు పట్టుకున్నారు.

నగరంలో రూ. 19 లక్షలు సీజ్

ఖలీల్‌వాడి : నగరంలోని 4వ టౌన్ పరిధిలోని పూలాంగ్ వద్ద మంగళవారం నగరానికి చెందిన గోగు మణికంఠ వద్ద రూ. 19 లక్షలు సీజ్ చేసినట్లు సీఐ నరహరి తెలిపారు. సీపీ కల్మేశ్వర్, అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్)జయరాం ఆదేశాల మేరకు ఏసీపీ కిరణ్ కుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో పట్టణ సీఐ నరహరి, నాలుగో టౌన్ ఎస్సై సంజీవ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు 4వ టౌన్ పరిధిలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి ఆధారాల్లేకుండా డబ్బును తీసుకెళ్తున్న మణికంఠ నుంచి డబ్బును స్వాధీనం చేసుకుని ఐటీ శాఖకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ పర్యటన రూట్‌మ్యాప్ పరిశీలన



ఏఐసీసీ సెక్రెటరీలతో మాట్లాడుతున్న తాహెర్‌బిన్ హందాన్

ఖలీల్‌వాడి : ఏఐసీసీ సెక్రెటరీలు ఉషానాథ్, రోహిత్‌చౌదరి మంగళవారం ఈనెల 20న ఏఐసీసీ మాజీ అధ్యక్షులు, ఎంపీ రాహుల్‌గాంధీ పాదయాత్ర రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. రాజరాజేంద్ర చౌరస్తా నుంచి అజాంరోడ్డు, నెహ్రూపార్క్, గాంధీచౌక్, ఆర్పీ రోడ్డు నుంచి తిలక్‌గార్డెన్ వరకు పాదయాత్ర కొనసాగుతుంది. అనంతరం రాహుల్‌గాంధీ టూర్‌ను విజయవంతం చేయాలని కాంగ్రెస్ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశంలో కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలని కాంగ్రెస్ నేతలకు ఆదేశించారు. కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బోధన్‌లో జాగృతి బతుకమ్మ సంబురాలు

బోధన్ : బోధన్‌లో భారత జాగృతి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నియోజకవర్గ స్థాయి బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నారు. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం సంబురాలకు వేదిక కానుంది. సంబురాలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ, భారత జాగృతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత, స్థానిక ఎమ్మెల్యే షకీల్ హాజరవనున్నారు. ఎమ్మెల్సీ కవిత మధ్యాహ్నం 12 గంటలకు రాకాసీపేట్, ఏకచక్రనగర్, హెడ్ పోస్టాఫీసు ప్రాంతాల్లో పలువురి ఇళ్లల్లో మహిళలతో కలిసి బతుకమ్మలను పేర్చనున్నారు. సంబురాలకు మహిళల సమీకరణలో నాయకులు నిమగ్నమయ్యారు. సాయంత్రం 4గంటలకు మహిళలతో ర్యాలీ నిర్వహించి జూనియర్ కళాశాల మైదానానికి చేరుకుని అక్కడి బావిలో బతుకమ్మలను నిమజ్జనం చేయనున్నారు.

రిఫర్ చేస్తే రివార్డు

- ఆర్ఎంపీ, పీఎంపీలను మచ్చిక చేసుకునేందుకు నజరానాలు
- జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో జోరుగా పర్సంటేజీల వ్యవహారం



వైద్యవిద్యకు సంబంధం లేని..

నిజామాబాద్‌నాగారం : జిల్లాకేంద్రంలోని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులకు రోగులను రిఫర్ చేస్తున్న ఆర్ఎంపీల, పీఎంపీలకు ముందుగానే నజరానాలు, కానుకలు జోరుగా అందుతున్నాయి. ఒకప్పుడు రోగుల రోగాన్ని బట్టి పర్సంటేజీలు మాట్లాడుకుని బేరసారాలు ఆడేవారు. ప్రస్తుతం మల్టీస్పెషాలిటీ ఆస్పత్రుల నిర్వాహకులు ముందుగా వారికి కానుకలిస్తూ మచ్చిక చేసుకుంటున్నారు. జిల్లాలోని పల్లెల నుంచి రోగులను రిఫర్ చేయడానికి జిల్లా కేంద్రంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల వారు పోటీపడి బంగారం, నగదు పెద్దఎత్తున అందజేస్తున్నారు.

కమీషన్లు వదిలి కానుకలు..

జిల్లా కేంద్రంలోని మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులు ఆర్ఎంపీ, పీఎంపీలకు పర్సంటేజీలు ఇస్తూ వస్తున్నాయి. ఇటీవల ఓ సీనియర్ ఆర్ఎంపీకి జూనియర్ ఆర్ఎంపీతో సమానంగా కమీషన్ ఇవ్వడంతో నారాజ్ కావడంతో ఇదంతా ఎందుకనుకున్న ఆస్పత్రి నిర్వాహకులు బంగారం, వస్తువులు ఇవ్వడం ప్రారంభించారు. జిల్లాకేంద్రంలో సుమారు 300 వరకు ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు ఉన్నాయి. అయితే వైద్యవిద్యకు ఎలాంటి సంబంధం లేనివాళ్లు వైద్యాన్ని వ్యాపారంగా మార్చేశారు. స్పెషలిస్ట్ వైద్యులను తీసుకొచ్చి ఆస్పత్రులు నెలకొల్పి పీఎంపీ ఆర్ఎంపీ వ్యవస్థకు తోడు ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకుని రోగులను రప్పించుకుంటున్నారు.

కోట్లల్లో పెట్టుబడి పెట్టాక..

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులను రూ. కోట్లు పెట్టి నెలకొల్పుతున్నారు. పెట్టుబడి పెట్టిన డబ్బులు తిరిగి రావాలంటే రోగుల ఆస్పత్రులకు రావాల్సిందే.. దీంతో ఆర్ఎంపీ, పీఎంపీలకు పెద్దఎత్తున ఆఫర్లు ఇస్తున్నారు. అంటే పీఎంపీ, ఆర్ఎంపీల వద్దకు రోగి వస్తే తమ ఆస్పత్రికే తీసుకొచ్చేలా ప్లాన్ వేసుకుంటున్నారు. జిల్లాలో సుమారుగా 3 వేల వరకు ఆర్ఎంపీ, పీఎంపీలున్నారు. కొత్తగా రోగి డిశ్చార్జి అయ్యాక కట్టిన బిల్లులో 30 శాతం నుంచి 50 శాతం వరకు కమీషన్లు తీసుకుంటున్నారు. హాస్యాస్పదమేమిటంటే ఎవరైనా పీఎంపీ ఆర్ఎంపీ ప్రైవేట్ ఆస్పత్రి కారణంగా అలిగితే ఆయనను తిరిగి మచ్చిక చేసుకునేందుకు వెంటనే ఆయన ఇంటికి నజరానాలు వెళ్లిపోతున్నాయి.

రోగులు బలిపశువులు..

భారీగా నజరానాలు వస్తుండడంతో పీఎంపీ ఆర్ఎంపీలు ఉత్సాహంగా రోగులను ఆయా ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఇక్కడ అమాయక రోగులు బలవుతున్నారు. చిన్నరోగమొచ్చినా వారిని ఏకంగా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స ఇప్పిస్తున్నారు.

క్లుప్తంగా

ఎడ్ల వెంకటేశ్‌కు కరాటే జడ్జి డిప్లొమా సర్టిఫికెట్ అందజేత



నిజామాబాద్‌నాగారం: నగరానికి చెందిన తెలంగాణ లీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కరాటే మాస్టర్ ఎడ్ల వెంకటేశ్ జడ్జి డిప్లొమా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈనెల 15న కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ రజనీష్ చౌదరి, టీఏఐఎస్‌కేడీ అసోసియేషన్ సంయుక్తంగా హైదరాబాద్‌లో 'జడ్జి, రిఫరీ సెమినార్ – ఎగ్జామినేషన్' నిర్వహించారు. తెలంగాణలోని ఆయా జిల్లాల నుంచి సుమారు 300 మంది కరాటే క్రీడాకారులు, మాస్టర్లు పాల్గొనగా, వెంకటేశ్, కార్తికేయ, వత్సన్, శ్రీనిష్, అనన్య ఉత్తమ ప్రతిభ కనబర్చి నేషనల్ జడ్జి డిప్లొమా సాధించారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన



నిజామాబాద్‌రూరల్: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని తిర్మన్‌పల్లి, గుండారం, కాలూర్ గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్‌హెచ్‌వో మహేశ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్‌లలో ఓటర్లకు మౌలిక సదుపాయాల వివరాల గురించి బూత్‌లెవల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ జరిగే రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ టీవీలు అమర్చే విధంగా పోలింగ్‌బూత్‌లను ఏర్పాటుచేయాలని తహసీల్దార్ అనురుధ్‌ను కోరారు. వారివెంట సర్పంచులు, కార్యదర్శులు ఉన్నారు.

బాల్కొండ మండలంలో..


బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్, బుస్సాపూర్, ఇత్వార్‌పేట్, జలాల్పూర్‌లోని పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు కనీస వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

వివాహిత అదృశ్యం

భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ మంగళవారం తెలిపారు. కొన్ని నెలుగా భార్యభర్తల మధ్య గొడలు జరగడంతో, ఈనెల 12న భార్య ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో భర్త ఆమె ఆచూకీ కోసం ఎంత వెతికిన కనిపించలేదు. ఈక్రమంలో మంగళవారం ఆయన భిక్కనూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఇందూరుకు 15వ ఎన్నిక

- రెండు సార్లు ఉప ఎన్నిక
- 1952లో ఏర్పడిన అర్బన్ నియోజకవర్గం
- అర్బన్‌లో ప్రాతినిధ్యం వహించిన అన్ని ప్రధాన పార్టీలు





డి. శ్రీనివాస్



సతీశ్‌పవార్





బిగాల



యెండల

ఖలీల్‌వాడి: జిల్లాలో ఎన్నికల సందడి మొదలైంది. 1952లో ఏర్పడిన అర్బన్ నియోజక వర్గం నాటి నుంచి నేటి వరకు నిర్వహించిన ఎన్నికల్లో ప్రజలు తమ అమూల్యమైన ఓటుతో ఉత్తమ నాయకుడిని ఎంపిక చేసుకుంటున్నారు. అర్బన్ నియోజకవర్గంలో నేటి ఎన్నికలతో కలిపి 15వ ఎన్నికలు జరగనున్నాయి. నాటి నుంచి అనేక పార్టీల అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. స్వతంత్రులు–3, బీజేపీ–2, కాంగ్రెస్–6, బీఆర్‌ఎస్–2 సార్లు విజయం సాధించి పాలన కొనసాగించాయి. అర్బన్‌లో రెండుసార్లు ఉప ఎన్నిక నిర్వహించారు. 1994లో టీడీపీ నుంచి సతీశ్‌పవార్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 2009–10లో నిర్వహించిన ఎన్నికల్లో బీజేపీ నుంచి యెండల లక్ష్మీనారాయణ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఉద్యమం తీవ్రతరం కావడంతో పదవీకి రాజీనామా చేసి 2010లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. బీజేపీకి నిజామాబాద్ గతంలో కంచుకోటగా ఉండేది. నగర కార్పొరేషన్‌లో 60 డివిజన్లు ఉన్నాయి. ఆర్మూర్ నియోజకవర్గం మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన బిగాల గణేశ్ గుప్తా 2009లో బీఆర్‌ఎస్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో 2014, 2018లో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. తాజాగా 2023 శాసనసభ ఎన్నికల్లో పార్టీ అధిష్టానం బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బిగాల గణేశ్ గుప్తాకు టికెట్‌ను కేటాయించింది. ఇంకా బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. 2018 ఎన్నికల్లో గణేశ్ గుప్తా కాంగ్రెస్ అభ్యర్థి తాహెర్‌బిన్‌హందాన్‌పై 25,841 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గణేశ్‌గుప్తాకు 71,896 ఓట్లు రాగా తాహెర్‌బిన్‌హందాన్‌కు 46,055 ఓట్లు వచ్చాయి. నాటి నుంచి నిజామాబాద్ నగర పాలక సంస్థ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలు హోరాహోరీగా పోటీ పడుతున్నాయి.

60 కార్పొరేషన్లలో..

గత ఎన్నికల్లో నిర్వహించిన 60 కార్పొరేషన్లలో 28 కార్పొరేషన్లు బీజేపీ అభ్యర్థులు గెలుపొందారు. కానీ మేయర్ స్థానాన్ని బీఆర్‌ఎస్ ఎంఐఎంతో జత కట్టి ఎక్స్‌అఫిసియో ఓట్లతో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. బీజేపీకి చెందిన 11 మంది కార్పొరేటర్లు ప్రస్తుతం బీఆర్‌ఎస్ తీర్థం తీసుకున్నారు. నియోజకవర్గంలో మున్నూరు కాపు, పద్మశాలీ, ముస్లిం మైనారిటీలు ప్రధాన సామాజిక వర్గాలు అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయిస్తాయి.

అర్బన్‌లో ఓటర్లు

పురుష ఓటర్లు	1,39,163
స్త్రీలు	1,47,571
ఇతరులు	32
మొత్తం ఓటర్లు	2,86,766

1952 నుంచి అర్బన్ నియోజకవర్గ రాజకీయ ప్రస్థానం

పదవీకాలం	ఎమ్మెల్యేగా గెలుపొందిన వారు	పార్టీ	పదవీకాలం	ఎమ్మెల్యేగా గెలుపొందిన వారు	పార్టీ
1952–57	మహ్మద్‌దావర్ హుస్సేన్	కాంగ్రెస్	1989–94	ధర్మపురి శ్రీనివాస్	కాంగ్రెస్
1957–62	మహ్మద్‌దావర్ హుస్సేన్	కాంగ్రెస్	1994–99	సతీశ్‌పవార్	టీడీపీ
1962–67	హరినారయణ్	స్వతంత్ర అభ్యర్థి	1999–04	ధర్మపురి శ్రీనివాస్	కాంగ్రెస్
1967–72	కేవీ గంగాధర్	స్వతంత్ర అభ్యర్థి	2004–09	ధర్మపురి శ్రీనివాస్	కాంగ్రెస్
1972–78	వి. చక్రధర్‌రావు	స్వతంత్ర అభ్యర్థి	2009–10	యెండల లక్ష్మీనారాయణ	బీజేపీ
1978–83	ఎ.కిషన్‌దాస్	కాంగ్రెస్	2010–14	యెండల లక్ష్మీనారాయణ	బీజేపీ
1983–85	డి.సత్యనారాయణ	టీడీపీ	2014–18	బిగాల గణేశ్ గుప్తా	బీఆర్‌ఎస్
1985–89	డి.సత్యనారాయణ	టీడీపీ	2018–24	బిగాల గణేశ్ గుప్తా	బీఆర్‌ఎస్

సరిహద్దులో నిఘా పెంచాలి

- కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ
- పలు పీఎస్‌ల తనిఖీ





సలాబత్‌పూర్ వద్ద తనిఖీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, పిట్లంలో..

మద్నూర్/ నస్రుల్లాబాద్/ బిచ్కుంద/ పిట్లం/ ఎల్లారెడ్డి/ బాన్సువాడ రూరల్/ పెద్దకొడప్‌గల్: రాష్ట్ర సరిహద్దు అయిన సలాబత్‌పూర్‌లో పోలీసు సిబ్బంది నిఘా పెంచాలని ఎస్పీ సింధుశర్మ అన్నారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ వద్ద తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దును మంగళవారం ఎస్పీ పరిశీలించారు. మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల వారు ఈ రహదారి గుండా జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉందని సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి డబ్బు, మద్యం, మత్తు పదార్థాలు తరలకుండా నిఘా ఉంచాలన్నారు. ఎస్పీ వెంట బిచ్కుంద సీఐ కృష్ణ, ఎస్సై కృష్ణారెడ్డి, అధికారులు, సిబ్బంది ఉన్నారు. నస్రుల్లాబాద్‌లోని జిల్లా సరిహద్దు చెక్ పోస్టును ఎస్పీ సింధు తనిఖీ చేశారు. అనంతరం పీఎస్‌ను సందర్శించి సిబ్బంది పని తీరును పరిశీలించారు. డీఎస్పీ జగన్నాథరెడ్డి, ఎస్సై తిరుపతి ఉన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలోని పీఎస్‌ను ఎస్పీ సందర్శించారు. జాగ్రత్తగా విధులను నిర్వర్తించాలని సీఐ కృష్ణ, ఎస్సై మురళిని ఆదేశించారు. పిట్లం పీఎస్‌ను ఎస్పీ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సీఐ మురళి, జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై విజయ్ కొండ, సిబ్బంది ఉన్నారు. ఎల్లారెడ్డి పీఎస్‌ను ఎస్పీ తనిఖీ చేసి పలు విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాస్, ఎస్సై గణేశ్ ఉన్నారు. బీర్కూర్ పీఎస్‌ను ఎస్పీ తనిఖీ చేసి రికార్డును పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ జగన్నాథరెడ్డి, రూరల్ సీఐ మురళి ఉన్నారు. పెద్దకొడప్‌గల్ పీఎస్‌ను ఎస్పీ సందర్శించారు. రహదారిపై వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. పీఎస్‌లో గ్రీనరీని చూసి ఎస్సై కోనారెడ్డి, సిబ్బందిని అభినందించారు.

ఇజ్రాయిల్ నుంచి తెలంగాణకు..

- ఆపరేషన్ అజయ్‌లో భాగంగా స్వగ్రామాలకు యువత



ఇజ్రాయిల్ నుంచి తెలంగాణకు వస్తున్న యువకులు

ఆర్మూర్: ఇజ్రాయిల్, గాజా స్ట్రిప్‌లోని హమాస్ తీవ్రవాదుల మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో భారత ప్రభుత్వం చేపట్టిన అజయ్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ జిల్లాలకు చెందిన 11 మంది యువకులు మంగళవారం తమ స్వగ్రామాలకు బయల్దేరారు. ఇజ్రాయిల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న వీరికి తెలంగాణ ఇజ్రాయిల్ అసోసియేషన్ తరఫున వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా తెలంగాణ ఇజ్రాయిల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సోమ రవి మాట్లాడుతూ.. ఆపరేషన్ అజయ్‌లో భాగంగా వీరు ఇజ్రాయిల్ నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని పేర్కొన్నారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర పలు దేశాలు వారి రాష్ట్రాలకు వెళ్లడానికి ప్రత్యేకంగా విమాన సదుపాయాలను కల్పించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు విమానాలు ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. స్వగ్రామాలకు వస్తున్న తెలంగాణ వారిలో రాచర్ల కనకయ్య (వేములవాడ), మారం మల్లికార్జున్, సామ వినోద్, బోడ డేవిడ్, గుగ్గిల్ల రాజు (నిజామాబాద్), అనుగందుల వెంకటి, అంగపల్లి శంకర్, సుద్దుల కిరణ్ కుమార్, తోట రవి, అద్దారి గోపీ, ఎయిలెన్ ఉన్నారు.

ప్రాణమున్నంత వరకు ప్రజాసేవ చేస్తా

- మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ బోధన్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి



ఎడపల్లిలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

ఎడపల్లి: ప్రాణం ఉన్నంతవరకు ప్రజాసేవ చేస్తానని కాంగ్రెస్ పార్టీ బోధన్ అభ్యర్థి పి. సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్టీ బూత్ కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ రూపొందించిన ఆరు గ్యారంటీ పథకాలను పార్టీ నాయకులు గ్రామాల్లో విరివిగా ప్రచారం చేయాలని సూచించారు. అభివృద్ధిని ప్రశ్నించిన ముస్లింలపై కేసులు పెట్టించి జైలు పాలు చేసిన ఘనత ఎమ్మెల్యే షకీల్‌దేనన్నారు. ఇలాంటి వ్యక్తికి రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పి గద్దె దించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, నాయకులు బిల్లా రామ్మోహన్, ఈరంటి లింగం, సాయికుమార్ రెడ్డి, కామప్ప, సూరిబాబు, స్వామిగౌడ్, బొబ్బిలి శ్రీనివాస్, అయూబ్‌ఖాన్, నాయిని బలరాం, గంగాధర్, హన్మంతురెడ్డి, మోహన్‌రెడ్డి, పోతన్న తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏ జట్టు కెప్టెన్‌గా నితీశ్‌రెడ్డి



జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్‌కు చెందిన పాట్కురి నితీశ్‌రెడ్డి రాష్ట్ర స్థాయి అండర్–23 హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ నెల 26 నుంచి గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో నిర్వహించే టోర్నీలో నితీశ్‌రెడ్డి పాల్గొననున్నాడు. జక్రాన్‌పల్లి జడ్పీటీసీ సభ్యురాలు పాట్కురి తనుజాశ్రీనివాస్ రెడ్డి దంపతుల కుమారుడు నితీశ్‌రెడ్డి. హైదరాబాద్‌లోని ఇండస్ వరల్డ్ స్కూల్‌లో పాఠశాల విద్యను, భవన్స్ వివేకానంద కళాశాలలో నితీశ్‌రెడ్డి ఎంబీఏ పూర్తి చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో రాణిస్తున్న మహ్మద్ సిరాజ్, ఉత్తమ ఆటగాళ్లయిన తిలక్ వర్మ, తన్మయ్ అగర్వాల్, సీవీ మిలింద్ వంటి ముఖ్య ఆటగాళ్లతో కలిసి ఆడినట్లు నితీశ్‌రెడ్డి తెలిపాడు.

ట్రోఫీ గెలవడమే లక్ష్యం

అంతర్జాతీయ క్రికెట్‌లో రాణిస్తున్న క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్తున్నాను. తల్లిదండ్రుల ప్రోత్సాహం నాకు ఎప్పటికీ ఉంది. కోచ్ అద్నాన్ సహకారంతోనే క్రికెట్‌లో రాణించగలుగుతున్నాను. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కెప్టెన్‌గా ఎంపిక కావడం గర్వంగా ఉంది. అండర్–23 ట్రోఫీ గెలవడమే నా ముందున్న లక్ష్యం.

– నితీశ్‌రెడ్డి, హెచ్‌సీఏ జట్టు కెప్టెన్

నిందితులను శిక్షించాలి



కూతురుతో కలిసి ఆందోళన చేస్తున్న శ్రీలత

జక్రాన్‌పల్లి: పుప్పాలపల్లి గ్రామంలో చాట్ల మహేశ్(29) సోమవారం చెరువులో పడి అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. దీంతో మంగళవారం మృతుడి భార్య శ్రీలత తన కూతురుతో కలిసి గ్రామ కూడలిలో బైఠాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహేశ్ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందలేదని ఇద్దరు వ్యక్తులు హత్య చేశారని కుటుంబీకులు ఆరోపించారు. మహేశ్‌ను చంపిన నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై తిరుపతి కుటుంబీకులతో మాట్లాడారు. నిందితులను అదుపులోకి తీసుకుని పూర్తి ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. నిందితులకు శిక్ష పడేలా చూస్తామని హామీ ఆందోళన విరమించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

మాక్లూర్: మండలంలోని వేణు కిసాన్‌నగర్ తండాకు చెందిన మాలోవత్ సుందర్ సింగ్ (36) కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో సోమవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధీర్ రావు మంగళవారం తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భిక్కనూరులో సైబర్ మోసం

భిక్కనూరు: పాన్‌కార్డ్ అప్‌డేట్ చేయించుకోవాలంటూ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేసి బ్యాంక్ ఖాతా పేరిట రుణం తీసుకుని నగదు బదిలీ చేసుకున్న ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గడ్డమీది ఓం ప్రకాశ్‌కు ఈనెల 11న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి పాన్‌కార్డ్ అప్‌డేట్ చేసుకోవాలని చెప్పి యాక్సిస్ బ్యాంక్ లింక్ పంపాడు. ఓం ప్రకాశ్ ఆ లింక్‌పై క్లిక్ చేసి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఖాతాను వారి ఆధీనంలోకి తీసుకొని ఖాతాలో ఉన్న రూ. ఎనిమిది వేల నగదుతో పాటు రూ. 8 లక్షల రుణాన్ని తీసుకొని ఖాతా నుంచి బదిలీ చేసుకున్నారు. తన బ్యాంక్ ఖాతా యాప్ పనిచేయడం లేదని ఓంప్రకాశ్ కామారెడ్డిలోని యాక్సిస్ బ్యాంక్‌కు వెళ్లి వివరాలు తెలుపగా ఈ మోసం గురించి తెలిసింది. వెంటనే బాధితుడు 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

తనిఖీలో నగదు పట్టివేత



రుద్రూర్/ఎల్లారెడ్డి/భిక్కనూరు/ కామారెడ్డి క్రైం/ మద్నూర్: కోటగిరి పీఎస్ పరిధిలోని పోతంగల్ చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలో ఒకరి నుంచి రూ.లక్షా39వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ మంగళవారం తెలిపారు. రుద్రూర్ మండలం అంబం గ్రామానికి చెందిన ఇందూర్ గగన్ నుంచి స్వాధీనం చేసుకున్న నగదుకు ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిలో వాహనాల తనిఖీల్లో రూ. 5,48,200 నగదు లభ్యమైనట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై గణేశ్ తెలిపారు. పట్టణ శివారులోని సోమార్‌పేట్ బైపాస్ వద్ద వాహనాల తనిఖీ చేపడుతుండగా మూడు కార్లలో రూ. 3,38,600, రూ. లక్ష, రూ.1,09,600 నగదు లభ్యమైందని ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తా వద్ద కారులో వెళ్తున్న ఒకరి నుంచి రూ. రెండు లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తిరుపయ్య, ఎస్సై సాయికుమార్‌లు తెలిపారు. నగదును ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ బైపాస్ వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.1.18 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ వద్ద రూ. 2.70 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ మహేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్, హరిజనవాడ కాలనీల్లో నిర్వహిస్తున్న రెండు బెల్ట్ షాపులపై ఎక్సైజ్ సిబ్బంది, పట్టణ పోలీసులు మంగళవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. వరలక్ష్మి గార్డెన్ ప్రాంతంలో ఉన్న ఓ కర్రీ పాయింట్‌లో, హరిజనవాడలోని ఓ ఇంట్లో మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించి దాడులు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో దాదాపు రూ. 20వేలకు పైగా విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గ్రామాల్లో మద్యం స్వాధీనం

దోమకొండ/ధర్పల్లి/మోపాల్/నవీపేట: దోమకొండ మండలంలోని అంబారిపేటలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్ దాడి నిర్వహించినట్లు ఎస్సై మురళి తెలిపారు. దాడిలో మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ధర్పల్లి మండలంలోని నడమి తండా, మరియా తండా, రేకులపల్లి గ్రామంలో బెల్ట్ షాపులపై పోలీసులు దాడి నిర్వహించారు. దాడిలో మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. మోపాల్ మండలంలోని కాల్‌పోల్‌లో రెండు బెల్ట్‌షాపులపై పోలీసులు దాడి చేశారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గంగాధర్ పేర్కొన్నారు. నవీపేట మండలంలోని పోతంగల్ శివారులో వాహనాల తనిఖీలో ఇద్దరి నుంచి 18 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ మంగళవారం తెలిపారు. పోతంగల్‌కు చెందిన లక్ష్మారెడ్డి, మల్కాపూర్‌కు చెందిన మజ్జిగ స్వామి నుంచి మద్యం లభ్యమైందని అన్నారు. మద్యాన్ని సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి



నరేశ్ (ఫైల్)



బాబు మృతదేహం

మోర్తాడ్: వరద కాలువలో పడి గల్లంతైన యువకుడి మృతదేహం మంగళవారం లభించిందని ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. మోర్తాడ్‌కు చెందిన బాస నరేశ్(33) సోమవారం కాలకృత్యాలు తీర్చుకునేందుకు వరద కాలువ వద్దకు వెళ్లగా అందులో పడి గల్లంతయ్యాడు. మృతుడి భార్య మేఘన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు, తల్లి ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి

రుద్రూర్(బాన్సువాడ): నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలో అనుమానాస్పద స్థితిలో ఓ లారీ డ్రైవర్ మరణించాడు. మృతుడిని సిద్దిపేట జిల్లా రేబర్తి గ్రామానికి చెందిన పిల్లి కండ్ల బాబు (40)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాబు ధాన్యం రవాణా కోసం లారీ తీసుకుని సోమవారం రుద్రూర్‌కు వచ్చాడు. పెట్రోల్ బంక్ సమీపంలో లారీని నిలిపాడు. మంగళవారం ఉదయం అటువైపు వెళ్లిన స్థానికులకు బాబు మృతదేహం కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు లారీపై ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి మృతుడి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బాబుకు ఫిట్స్ రావడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై నీరేశ్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న డీసీఎం

- ఒకరి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన బాధిత కుటుంబం (ఫైల్)

పిట్లం(జుక్కల్): బైకును డీసీఎం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన సంగారెడ్డి జిల్లా జంబిగే గేటు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న పిట్లం మండలం చిల్లర్గి గ్రామానికి చెందిన పండరి(36) మృతి చెందగా భార్య, కుమారులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పండరి భార్య వినోద, కుమారులు శ్రీహర్షిత్, శ్రీహన్షిత్‌తో కలిసి బైక్‌పై సంగారెడ్డి జిల్లా తడ్కల్ గ్రామంలోని తన అక్క దగ్గరికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా జంబి గేట్ వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో గాయపడ్డ పండరి కుటుంబ సభ్యులను అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పండరి మృతి చెందినట్లు తెలిపారు. అతని భార్య, కుమారులకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు.

తలమడ్లలో చోరీ

రాజంపేట: తలమడ్ల గ్రామంలోని ఓ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై సంపత్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన సాయవ్వ ఈ నెల 13న నిజామాబాద్‌లో ఉన్న తన సోదరుడి ఇంటికి వెళ్లింది. మంగళవారం వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. 50 తులాల వెండి, రూ.40 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితురాలి తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంపత్ పేర్కొన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని మల్లయ్యపల్లి గేట్ వద్ద మంగళవారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మెదక్ జిల్లా పాపన్నపేట్‌కు చెందిన సాయికుమార్ మెదక్ నుంచి ఎల్లారెడ్డికి వస్తుండగా, నాగిరెడ్డిపేట మండలం గోలిలింగాలకు చెందిన రామకృష్ణ తల్లి సావిత్రితో కలిసి ఎల్లారెడ్డి నుంచి స్వగ్రామానికి వస్తుండగా మల్లయ్యపల్లి శివారులో రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో సాయికుమార్, సావిత్రికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వృద్ధుడి అదృశ్యం



ఖలీల్‌వాడి: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొల్పూర్‌కు చెందిన ఆమెన్ల దేవన్న(65) అదృశ్యమైనట్లు ఒక టోటౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. దేవన్న మంగళవారం ఆస్పత్రి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

వాహనాలను పరిశీలించాలి



వర్ని: జిల్లా సరిహద్దు దాటుతున్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ సిబ్బందికి సూచించారు. వర్ని పీఎస్ పరిధిలోని మల్లారం శివారులో ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఎన్నికల సమయంలో ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏసీపీ వెంట సీఐ జితేశ్ రెడ్డి, ఎస్సై కృష్ణకుమార్ ఉన్నారు.